

# మందారమాల
## సత్యం మందపాటి

నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల 27

## రసాలూరించిన రాజేస్వరం



'చల్లగాలిలో యమునా తటిపై శ్యామసుందరునే మురళీ, మురళీ శ్యామసుందరునే మురళీ'

'పాట పాడుమా కృష్ణా పలుకు తేనె లొలుకు నటుల, మాటలాడుమా ముకుంద మనసు తీయగా!'

'ఓ విభావరీ... ఓహో విభావరీ.. నీహార నీల నీలాంబరధారిణీ మనోహారిణీ'

'తుమ్మెదా ఒకసారి మోమెత్తి చూడవే'

దాదాపు ఏభై సంవత్సరాల క్రితం ఈ పాటలని వీనుల విందుగా ఆలపించినది రసాలూరించిన సాలూరి.

మన మనసుల్లో ఇన్నాళ్ళు పదిలంగా గూడు కట్టుకుని అలా నిలిచిపోయిన ఈ లలిత గీతాలకి సుమధురంగా స్వరాలు కట్టినది రాజే'స్వర' రావు.

సాలూరి రాజేశ్వరరావు.

ఈ లలిత గీతాలన్నీ వ్రాసినది రాజేశ్వరరావుగారి నాన్నగారు శ్రీ సాలూరి సన్యాసిరాజుగారు.

0 0 0

1981లో అమెరికా వచ్చినప్పుడు, న్యూయార్క్‌లో ఒక మాట అన్నారు రాజేశ్వరావు.

'ఈ పాటలు ఈనాటి వారికి నచ్చుతాయో లేదో. ఎందుకు నచ్చవులెండి. మెలోడి అనేది వుంటే పాటలు ఎన్నాళ్ళయినా అలానే నిలిచిపోతాయి' అని.

అందుకేనేమో ఈనాటికీ చక్కటి మెలోడీ వున్న ఈ పాటలు మనని అలరిస్తున్నాయి.

చాలరోజుల క్రితం బాపుగారు ఒక కార్టూన్ వేశారు.

రాజేశ్వరావు కళ్ళు మూసుకుని తన్మయత్వంతో 'పాట పాడుమా కృష్ణా' అని పాడుతూ వుంటారు.

ఎదురుగా నుంచుని వున్న కృష్ణుడు 'నువ్వు పాడినంత మధురంగా నేను పాడగలనా రాజేశ్వరరావూ... నువ్వే ఆ పాట పాడు' అంటాడు.

అది బాపు రాజేశ్వరావు కిచ్చిన స్వర్ణ పతకం!

0 0 0

1922లో ఈనాటి విజయనగరం జిల్లాలోని సాలూరు సమీపంలోని శివరామపురంలో జన్మించారు రాజేశ్వరావు. ఆయన తండ్రిగారు గొప్ప పాటల రచయితే కాకుండా, మంచి సంగీతకారులు. ద్వారం వెంకటస్వామి నాయుడుగారు వయొలీన్ వాయిస్తుంటే, సన్యాసిరాజుగారు ఆయనకి మృదంగం వాయించేవారు.

రాజేశ్వరావు నాలుగో ఏటనే రకరకాల రాగాలను గుర్తుపట్టటం ఆలపించటం చేస్తుండేవాడు. ఏడేళ్ళ వయసులో సభాముఖంగా కచేరీలు చేశేవాడు. పన్నెండేళ్ళ వయసులోనే హచ్చిన్స్ రికార్డింగ్ కంపెనీవారు అతని ప్రతిభని గుర్తించి, సన్యాసిరాజుగారితో సహా ఆయన్ని బెంగుళూరు తీసుకువెళ్ళారు. దరిమిలా ఆయన చేత 'భగవద్గీత' రికార్డింగ్ చేయించారు.

బెంగుళూరులో రాజేశ్వరావు సంగీతాన్ని విన్న సినిమా నిర్మాతలు గూడవల్లి రామబ్రహ్మం, పి.వి.దాస్ ఆయన్ని మద్రాస్ తీసుకువెళ్ళారు. కలకత్తాలో నిర్మించిన శ్రీకృష్ణలీలలు సినిమాలో పన్నెండేళ్ళ వయసులోనే కృష్ణుడి పాత్ర ఇచ్చారు. ఆ చిత్రం విడుదలవగానే, రాజేశ్వరావ్ పేరు మారుమోగిపోయింది. 1936లో మాయాబజార్ సినిమాలో అభిమన్యుడి పాత్ర కూడా ఆయనకి చాల పేరు తెచ్చింది. కలకత్తాలోనే నిర్మించిన 'కీచకవధ', 'ఉత్తర గోగ్రహణం' సినిమాల్లో నటించారు. ఆ రోజుల్లో ఎవరి పాటలు వాళ్ళే పాడేవారు. ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషమేమిటంటే, రాజేశ్వరావు పాడిన పాటలకీ, ఆ చిత్రాలకీ మృదంగం వాయించినది ఆయన తండ్రి సన్యాసిరాజుగారు.

కలకత్తాలో సినిమాల్లో నటిస్తూ, పాటలు పాడుతున్నప్పుడే ప్రసిద్ధ గాయకుడు కె.ఎల్.సైగల్ దగ్గర గజళ్ళు పాడటం నేర్చుకున్నారు. పంకజ్ మల్లిక్ వాద్యబృందంలో చేరి, తన సంగీత జ్ఞానానికి పదును పెట్టుకున్నారు. ఫైస్ ఖాన్ దగ్గర హిందుస్తానీ సంగీతం నేర్చుకున్నారు. తర్వాత మళ్ళీ మద్రాసు వచ్చి, తన స్వంత ఆర్కెస్ట్రా ప్రారంభించారు. తన పదిహేడవ ఏట అంటే 1939లోనే మొట్టమొదటగా జయప్రద అనే చిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. జెమినీ సంస్థలో చేరి ఇల్లాలు, బాలనాగమ్మ, చంద్రలేఖ మొదలైన చిత్రాలకు పలుభాషల్లో సంగీతం అందించారు.

పదమూడు సినిమాలకు సంగీత దర్శకత్వం వహించిన తర్వాత, తెలుగు సినిమా చరిత్రలోనే మరువలేని మరుపురాని సువర్ణావకాశం రాజేశ్వరావ్‌కి లభించింది. అదీ బి.ఎన్.రెడ్డి వంటి గొప్ప దర్శకుడూ, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి మహా రచయితల సహకారంతో, ప్రోత్సాహంతో.

0 0 0

'ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు, దేశదేశాలన్ని తిరిగి చూసేవు
ఏడ తానున్నాడో బావా, జాడ తెలిసిన పోయిరావా
గగనసీమల ఓ మేఘమాలా మా వూరి గుడి పైని మసలి వస్తున్నావా
మల్లి మాటేదైన నాతో మనసు చల్లగ చెప్పి పోవా

నీలాల ఓ మేఘమాలా! రాగాల ఓ మేఘమాలా!'

దేవులపల్లి భావ కవితా సాహిత్యానికి ఆభేరి రాగంలో స్వరపరిచిన రాజే'స్వర' గీతమిది. మణి దీపమిది.

మధుర గాయకులు భానుమతి ఘంటసాల యాభై ఏళ్ళకి ముందు పాడి, ఇంకా సజీవంగా నిలిపిన పాట. బి.ఎన్.రెడ్డిగారి సాహిత్య సంగీతాభిమానానికి ప్రతీక.

అదే చిత్రంలో ఇంకా ఎన్నో మధురాజేస్వరాలు మన మనసున మల్లల మాలలూగిస్తాయి. కన్నుల వెన్నెల డోలలూగిస్తాయి.

0 0 0

రాజేశ్వరావుగారి పాటలు వింటుంటే ఆయనకి మోహన, ఆభేరి, సింధుభైరవి, భీంప్లాస్, కాఫీ, కల్యాణి, పహాద్ మొదలైన రాగాలు చాల ఇష్టమైనవి అనిపిస్తుంది.

మనం రాజేశ్వరావుగారి పాటల్లో మీకు ఇష్టమైనవి ఏవి అని ఎంతమందిని అడిగితే, అన్ని పాటలు చెబుతారు. ఒక్కొక్కటీ ఒక్కొక్క వజ్రపు తునక మరి. చెంచులక్ష్మిలో పాలకడలి పై శేషతల్పమున, నీలగగన ఘనశ్యామా, ఆనందమాయె అలినీలవేణి, కరుణాలవాల ఇది నీదు లీల, కనలేరా కమలాకాంతుని, చిలకా గోరింకా కులికే పకపక... అన్నీ వీనుల విందు చేసే రసరాగాలే!

చెంచులక్ష్మి చిత్రం గురించి చెప్పగానే, నాకు భక్త ప్రహ్లాద గుర్తుకు వస్తుంది. బాలమురళీకృష్ణ చేత ఎన్నో చక్కటి పాటలు పాడించిన చిత్రం. 'ఆది అనాదియు నీవే దేవా', 'వరమొసగే వనమాలీ' మరిచిపోలేని పాటలు. ఈ చిత్రంలోనే సుశీల పాడిన 'నారాయణమంత్రం శ్రీమన్నారాయణ మంత్రం', 'జీవము నీవే కదా', 'జననీ వరదాయనీ త్రిలోచనీ' గొప్ప పాటలయితే, పోతన్నగారు తన మందార మకరంద మాధుర్యమున తేలు పద్యాలని, రాజేశ్వరావు సంగీతంతో, సుశీల తేనెలూరు కంఠస్వరంతో విని వుంటే భావోద్వేగంతో ఆనంద భాష్పాలు రాల్చి వుండేవారు!

సుశీల గొంతులోని మాధుర్యాన్ని రాజేశ్వరావు వెలికితీసినంతగా ఇంకెవరూ చేయలేదనిపిస్తుంది. అలాగే సుశీల ఆరాధన చిత్రంలో పాడిన 'వెన్నెలలోని వికాసమే వెలిగించెద నీ కనుల...' ఎంతో తీయని పాట. చదువుకున్న అమ్మాయిలు చిత్రంలోని 'వినిపించని రాగాలే, కనిపించని అందాలే' నాకు ఎంతో ఇష్టమైన పాట.

విప్రనారాయణలోని 'మధురమధురమీ చల్లనిరేయీ, మరవతగనిది ఈ హాయీ!', 'చూడుమదే చెలియా', 'మేలుకో శ్రీరంగా', 'రారా నా స్వామి రారా', 'సావిరహే తవదీనా', 'ఎందుకోయీ తోటమాలీ' చిరస్మరణీయాలు.

రాజేశ్వరావు సంగీతం అనగానే గుర్తుకి వచ్చే చిత్రాల్లో ఇంకొకటి మిస్సమ్మ. బృందావన మది అందరిదీ, కరుణించు మేరి మాతా, రావోయి చందమామ, కావాలంటే ఇస్తాలే, తెలుసుకొనవె చెల్లీ/యువతీ, ఔనంటే కాదనిలే, బాలనురా మదనా, ఏమిటో నీ మాయ, ధర్మం చెయ్ బాబూ... వీటిల్లో ఏ పాట తక్కువదో చెప్పటం కష్టం.

మోహనరాగంతో షణ్ముఖప్రియ, మధ్యమావతి కలిపి స్వర పరిచిన 'గోపాల జాగేలరా' అనే జావళి భలే అమ్మాయిలు చిత్రంలోనిది. అలాగే పూలరంగడు సినిమాలో కల్యాణి రాగంలో బాణీ కట్టిన 'చిగురులు వేసిన కలలన్నీ సిగలో పూలుగ మారినవి' ఎప్పుడు విన్నా హాయిగా వుంటాయి.

వీణ వాయిస్తూ పాడే పాటల్లో రాజేశ్వరావు రసస్ఫూర్తి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. సుశీల పాడిన భార్యాభర్తలు చిత్రంలో 'ఏమని పాడెదనో ఈవేళ, మౌనముగా నిదురించిన వేళ', ఇద్దరుమిత్రులు చిత్రంలో 'పాడవేల రాధికా ప్రణయ సుధా గీతిక', 'మానస వీణ మౌనముగా', డాక్టర్ చక్రవర్తి చిత్రంలో 'నీవు లేక వీణ పలుక లేనన్నదీ', 'పాడమని నన్నడుగ తగునా' లాటివి కొన్ని మచ్చుతునకలు. చిలకా గోరింక చిత్రంలో ఘంటసాల పాడిన 'నా రాణి కనులలోనే' వీణ మీద వాయించిన ఇంకొక పాట.

వయొలిన్ మీద వాయించిన చక్కటి పాటల్లో ముందుగా నిలిచేది పూజాఫలం చిత్రంలోని 'పగలే వెన్నెల జగమే ఊయల'. పూజాఫలం చిత్రంలోవే మరో రెండు పాటలు ఘంటసాలవారి 'నిన్నలేని అందమేదో నిదురలేచె నెందుకో', జానకి 'శివదీక్షాపరురాలనురా' మరుపురాని మధుర గీతాలు.

హాస్యపరమైన పాటలకు చాల సులభమైన బాణీతో స్వర కల్పన చేయటం అంత సులభం కాదు. కులగోత్రాలు సినిమాలో కొసరాజుగారి అల్లరి సాహిత్యానికి రాజేశ్వరావు స్వర రచన చేసిన పాట 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే'. అలాగే అప్పుచేసి పప్పుకూడు చిత్రంలోని 'కాశీకి పోయాను రామాహరీ', డాక్టర్ చక్రవర్తిలోని 'ఒంటిగ సమయం చిక్కిందీ'. ఇలా ఎన్నో, ఎన్నెన్నో.

రాజేశ్వరావుగారి పాటల గురించి ఎంత రాసినా, అయ్యో ఈ పాట గురించి రాయలేదే అనుకునేటన్ని పాటలు ఇంకా ఎన్నో వందల్లో వున్నాయి. ఏమని వ్రాయను? ఎలా వ్రాయను?

0 0 0

రాజేశ్వరావుగారు చాల హాస్య ప్రియులు కూడాను.

ఆయన పాటలకి పెద్ద ఆర్కెస్ట్రా వాడటం చూసి ఒక నిర్మాత అన్నాడుట.

'రాజేశ్వరావుగారూ. మనకెందుకండీ అంత పెద్ద ఆర్కెస్ట్రా. బెంగాలీవాళ్ళలా ఒకటో రెండో వాయిద్యాలతో రికార్డింగ్ చేసేయరాదూ' అని.

'దాందేముంది అలాగే కానిద్దాం. కాకపోతే మీ సినిమాని మీరు బెంగాలీ సినిమాలా ఆదివారంనాడు ఒక మార్నింగ్ షో మాత్రమే వేసుకోవాల్సి వస్తుంది' అని రాజేశ్వరావుగారి జవాబు.

తన చిత్రానికి సంగీతం రోజా చిత్రంలో పాటల్లా వుండాలన్నాడుట ఒక నిర్మాత.

'అలాగే. మీ చిత్రానికి దర్శకుడు మణిరత్నమా?'

'కాదు'

'అరవిందస్వామి హీరోనా?'

'కాదు'

'కాశ్మీర్‌లో తీస్తున్నారా?'

'లేదు. హైదరాబాద్‌లో తీస్తున్నాం'

'మరయితే సంగీతం మాత్రం రోజా సినిమాలోలాగా ఎందుకు వుండాలి చెప్పండి' అడిగారు రాజేశ్వరావు.

0 0 0

1979లో ఆంధ్రా యూనివర్సిటీ ఆయన్ని కళాప్రపూర్ణగా గుర్తించి డాక్టరేట్‌తో సన్మానించింది.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆస్థాన విద్వాంసుడిగా ఆయన చేత అన్నమాచార్య కృతులను స్వరీకరించి, ఘంటసాల చేత పాడించారు.

తమిళ్‌నాడులోని ఇసాయ్ నాటక మండ్రం ఆయనకి 'కలైమామణి' బిరుదు నిచ్చి గౌరవించింది.

1992లో ఆయనకి రఘుపతి వెంకయ్య పురస్కారం లభించింది.

1999 అక్టోబర్ 25న మనల్ని ఇక్కడే వుండి తన సంగీతాన్ని అస్వాదించమని చెప్పి, కొన్ని తరాలకు సరిపడే స్వర మాధుర్యాన్ని మనకి మిగిల్చి, ఏమీ తెలియనట్టు తన దారిని తాను వెళ్ళిపోయారు.

0 0 0